'థీసిస్ సమర్పించేందుకు గడువు పొడిగించాలి'

వీసీ చాంబర్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 31: ఉస్మానియా యూనివర్సిటీలో పరిశోధన చేస్తున్న 2017 బ్యాచ్ పరిశోధక విద్యార్థుల థీసిస్ సమర్పించేందుకు మూడు నెలల గడువు పొడిగించాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. ఈ మేరకు పీడీఎస్‌యూ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో పరిపాలనా భవనంలోని వీసీ చాంబర్ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు ఎస్. నాగేశ్వరరావు, ఓయూ అధ్యక్షుడు సుమంత్ మాట్లాడుతూ.. వీసీ ప్రొఫెసర్ రవీందర్ నిర్ణయాలతో పరిశోధక విద్యార్థులు మనోవేదనకు గురి అవుతున్నారన్నారు. ప్రీ సబ్మిషన్ సెమినార్ పూర్తి అయిన తర్వాత సడ్మిషన్ కోసం కనీసం మూడు నెలల సమయం ఇవ్వాలని యూజీసీ నిబంధనలు ఉంటే ఓయూ మాత్రం కేవలం పది రోజుల సమయం మాత్రమే ఇచ్చి పరిశోధక విద్యార్థులను మానసిక వేదనకు గురిచేస్తోందని వాపోయారు. వెంటనే ఈ నిర్ణమాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ప్రశాంత్, సతీశ్, క్రాంతి, పర్వేజ్ కమల్, సుమన్, దిలీప్, అనిల్, దీపిక, వర్షిత, నందిని, సౌజన్య, రవళి, నవీన్, రోషిణి, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్‌ను త్వరగా పూర్తి చేయాలి

- నిధుల కొరత లేకుండా చూస్తా
- మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట్, జనవరి 31 : పేద, మధ్య తరగతి ప్రజల సౌకర్యం కోసం ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తున్నట్లు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. డబుల్ సెల్లార్ పార్కింగ్, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫంక్షన్ హాల్, మొదటి ఫ్లోర్‌లో డైనింగ్‌హాల్ ఉండేలా డిజైన్ చేసినట్టు తెలిపారు. అందుకోసం రూ. 12.96 కోట్ల నిధులను వెచ్చిస్తున్నట్టు తెలిపారు. బుధవారం హౌసింగ్ బోర్డు డీఈ రాధాకృష్ణ, మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారిలతో కలిసి కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను పరిశీలించారు. నిధుల కొరతతో కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులు నిలిపివేశామని ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే స్పందించి నిధులు మంజూరు చేయించి కమ్యూనిటీ హాలు పనులు పూర్తి చేసి వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ ఇందిర, జలమండలి జీఎం హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి కమ్యూనిటీ హాల్ పనులపై చర్చిస్తున్న ఎమ్మెల్యే తలసాని

జ్ఞాపిక అందజేత

బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో జరుగుతున్న శ్రీశతచండీయాగ సహిత మహా కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పూజలు చేశారు. ఈవో కుంట నాగరాజు, చైర్మన్ కొత్తపల్లి సాయిగౌడ్, ఆలయ పాలక మండలి సభ్యులు ఎమ్మెల్యే తలసానికి అమ్మవారి తీర్థప్రసాదాలతో పాటు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎం.హనుమంతరావు పాల్గొన్నారు. - అమీర్‌పేట్, జనవరి 31

ప్రతిరోజూ వ్యాయామం చేయాలి

ఒకటోవార్డు సంచారపురి పార్క్‌లో షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభిస్తున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్

కంటోన్మెంట్, జనవరి 31: ప్రతి మనిషికి ఫిట్‌నెస్ చాలా అవసరమని ప్రతిరోజూ కనీసం ఒక గంటసేపు వ్యాయామం చేస్తే ఎలాంటి వ్యాధులు రావని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని ఒకటోవార్డు సంచారపురి పార్క్‌లో స్థానికకాలనీ వాసులు తమ సొంత నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును బుధవారం జంపన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఈ పార్క్‌లో వాకింగ్ ట్రాక్‌తో పాటు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని స్థానికులు జంపన ప్రతాప్‌కు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన జంపన వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు బోర్డు సీఈఓ దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు.

పెరిగిన ఓయూ కీర్తి ప్రతిష్ట

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 31: జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సమైక్యతా శిబిరాలకు ఓయూ నుంచి వెళ్లిన ప్రోగ్రాం ఆఫీసర్లు, వలంటీర్లను బుధవారం ఓయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సవీన్ సౌడ అభినందించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ యువ శిబిరానికి డాక్టర్ జగదీశ్వర్ ఆధ్వర్యంలో పది మంది వలంటీర్లు, తమిళనాడులో జరిగిన జాతీయ సమైక్యతా శిబిరానికి డాక్టర్ శోభారాణి ఆధ్వర్యంలో పది మంది వలంటీర్లు, ఎంఎల్ఆర్ఐటీలో జరిగిన జాతీయ సమైక్యతా శిబిరానికి డాక్టర్ జాహేదా ఆధ్వర్యంలో ఆరుగురు వలంటీర్లు, జాతీయ యువజన ఉత్సవానికి డాక్టర్ చినబాబు ఆధ్వర్యంలో నలుగురు వలంటీర్లు హాజరై ఓయూ కీర్తి ప్రతిష్టలను పెంచారని ప్రొఫెసర్ సవీన్ ప్రశంసించారు.

ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వలంటీర్లతో ప్రొఫెసర్ సవీన్ సౌడ

'అమ్మాయిలు ధైర్యంగా ముందుకెళ్లాలి

శిక్షణా కార్యక్రమానికి హాజరైన అమ్మాయిలతో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 31: అమ్మాయిలు ధైర్యంగా ముందుకెళ్లాలని వక్తలు సూచించారు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. యాక్షన్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో అమ్మాయిలకు నాయకత్వ లక్షణాలపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని తార్నాకలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మాయిలు ఎవరిదగ్గరైనా గట్టిగా మాట్లాడాలన్నారు. ఈ విషయాలపై నాటక ప్రదర్శన చేస్తూ అమ్మాయిలకు వివరించారు. రసూల్‌పుర, అంబేద్కర్‌నగర్, మడ్‌ఫోర్డ్, అడ్డగుట్ట బస్తీలకు చెందిన 32 మంది అమ్మాయిలు శిక్షణకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యాక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధులు వందన, దివ్య, చిన్మయి పాల్గొన్నారు.

బైక్ స్టంట్లు.. రేసింగ్‌లు వద్దు

అమీర్‌పేట్, జనవరి 31: విద్యార్థులు బైక్‌లపై సరదాల కోసం చేసే స్టంట్లు, రేసింగ్‌లు ప్రాణాంతకమైనవని బేగంపేట్ టీటీఐ ఏసీపీ జి.శంకర్‌రాజు తెలిపారు. బుధవారం ఎస్ఆర్‌నగర్ లక్ష్య కాలేజీ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు, సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు, వాటి నివారణ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ట్రిపుల్ రైడింగ్, సిగ్నల్ జంపింగ్, ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటివి చేస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారన్నారు. 2023లో రాంగ్ సైడ్ డ్రైవింగ్ కేసులు 5,23,382 నమోదయ్యాయన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మురళి, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయికుమార్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ శివప్రసాద్‌రెడ్డి, హెచ్‌వోడీ ప్రియాంక చౌదరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కంటోన్మెంట్, జనవరి 31: ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే జరిమానాతో పాటు కేసులు తప్పవని బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఎస్సై వెంకట్ రమణ అన్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లిలోని సిటీకేఫ్ వద్ద రోడ్లపైన నిబంధనలు అతిక్రమిస్తూ పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ జామ్ అవుతూ ఆర్టీసీ బస్సుల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని స్థానికుల నుంచి ఫిర్యాదులు ట్రాఫిక్ పోలీసులకు అందాయి. ఈ నేపథ్యంలో బుధవారం బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నాగయ్య ఆదేశాల మేరకు ఓల్డ్ బోయిన్‌పల్లిలో ఎస్సై వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ క్రమంలో రోడ్లపై వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై భారీగా చలాన్లు విధించారు. అంతేకాకుండా పలువురిపై కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు మహేశ్వర్‌రెడ్డి, చెన్నయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ఓల్డ్ బోయిన్‌పల్లి రోడ్డుపై వ్యాపారాలు చేస్తున్న వారిపై కేసు నమోదు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు

అడ్డగుట్ట, జనవరి 31 : ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించినా, నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవని సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారి ఏసీపీ రజిత హెచ్చరించారు. బుధవారం మెట్టుగూడ ఆలుగడ్డ బావి నుంచి తార్నాక, లాలాపేట ఫ్లై ఓవర్‌కు రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మాట్లాడుతూ.. రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఆక్రమణల తొలగింపు ప్రక్రియ సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో దశలవారీగా చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పాదచారులు, వాహనదారులకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి సరిత, వార్డు టౌన్‌ప్లానర్స్ ప్రకాశ్, మౌనిక, టైన్‌మెన్స్ నాగయ్య, ఆంజనేయులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను జేసీబీతో తొలగిస్తున్న సిబ్బంది

పూర్వ విద్యార్థికి సన్మానం

పద్మారావునగర్‌లోని సర్దార్ పటేల్ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థి పి.రవివర్మ ఆ కళాశాలకు కెనరా బ్యాంక్ సీఎస్ఆర్ నిధులతో బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా రవివర్మను కళాశాల పాలక మండలి కార్యదర్శి బి.సురేందర్ రెడ్డి, కోశాధికారి రూప్ సింగ్, ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత సన్మానించారు.

- బన్సీలాల్‌పేట్, జనవరి 31

పనులు పరిశీలన

బోయిగూడలోని ముస్లిమ్ బస్తీలో నూతన డ్రైనేజీ పైపులైన్ పనులు పూర్తి అయ్యాయి. అనంతరం ప్యాచ్ వర్క్ పనులను బుధవారం జలమండలి ఆధ్వర్యంలో ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు కే.లక్ష్మీపతి, రజాక్, అబ్బాస్, ముకర్రమ్, సల్మాన్ పరిశీలించారు.

- బన్సీలాల్‌పేట్, జనవరి 31

ఆశీస్సులు

పద్మారావునగర్‌లోని స్కందగిరి దేవాలయంలో కంచికామకోటి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతిని కలిసి ఆశీర్వాదం తీసుకున్న బీజేపీ నాయకుడు మర్రి పురూరవరెడ్డి, దేవాలయ చైర్మన్ ఎల్వీ.సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

-బన్సీలాల్‌పేట్, జనవరి 31

'హెచ్‌పీఎస్'పై చర్యలు తీసుకోవాలి

హెచ్‌పీఎస్ నిర్మిస్తున్న నూతన గోడ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 31: ఉస్మానియా యూనివర్సిటీతో కుదుర్చుకున్న లీజు నిబంధనలు ఉల్లంఘిస్తున్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్)పై చర్యలు తీసుకోవాలని నిరుద్యోగ, విద్యార్థి జేఏసీ చైర్మన్ భీంరావు నాయక్ డిమాండ్ చేశారు. రామంతాపూర్ హెచ్‌పీఎస్ ప్రహరీ కూలగొట్టి తమ సొంత గోడను నిర్మించుకుంటున్నారని చెప్పారు. లీజు నియమాలను ఉల్లంఘించి గోడ కడుతున్నా వర్సిటీ అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. లీజు నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్యకర్తలకు అండగా..

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బేగంపేట శ్యామ్‌లాల్ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త యాదయ్య కుటుంబ సభ్యులకు బుధవారం కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేశ్ పార్టీ నుంచి మంజూరైన 2 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.

- బేగంపేట్, జనవరి 31

ఘనంగా గాంధీజీ వర్ధంతి

గాంధీ వర్ధంతి సందర్భంగా దుర్గాబాద్ దేశ్‌ముఖ్ మహిళా సభ (డీడీఎంఎస్) క్యాంపస్‌లో కార్యక్రమాలు నిర్వహించారు. డీడీఎంఎస్ విద్యాసంస్థలన్నీ కలిసి క్యాంపస్‌లోని గాంధీ శతాబ్ది భవన్‌లో అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంఘ సేవకురాలు జ్యోత్స్న, డీడీఎంఎస్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ జీఎల్‌కే దుర్గ, ఏఎంఎస్ ఫేమ్ కార్యదర్శి భవాని, కళాశాల కార్యదర్శి డాక్టర్ పి. రజని పాల్గొన్నారు.

- ఉస్మానియా యూనివర్సిటీ

నిధులున్నా..ప్రారంభం కాని పనులు

- ఇబ్బందులు పడుతున్న బస్తీవాసులు
- తిరిగి టెండర్లు పిలుస్తాం

రెజిమెంటల్‌బజార్‌లో గుంతలమయంగా మారిన రోడ్లను చూపిస్తున్న స్థానిక మహిళలు

మారేడ్‌పల్లి, జనవరి 31: ఓ వైపు ఆ బస్తీలో డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి.మరోవైపు ఆ రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి గానూ రూ.20 లక్షలు మంజూరు అయి ఏడాది కావస్తున్నా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్ లోని సలూజా నర్సింగ్ హోం ఎదురుగా ఉన్న బస్తీ రోడ్డులో సుమారు 25 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఆ బస్తీల్లో రహదారి గుంతలమయంగా ఉండడంతో ప్రయాణం సాగించాలంటే ఇబ్బందికరంగా మారింది. దీంతో బుధవారం స్థానిక మహిళలు బస్తీ సమస్యను విలేకరుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఏడాది క్రితం రూ. 20 లక్షలు మంజూరు అయినప్పటికీ ఇప్పటి వరకు రోడ్డు వేయలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ బస్తీలో సీసీ రోడ్డు వేయాలని స్థానిక మహిళలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు భాగ్య, పద్మజ, రాధిక, శైలజ, నీలా, రాణి, ద్రాక్ష ఉన్నారు.

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు

- రవీందర్, జీహెచ్ఎంసీ ఏఈ

రెజిమెంటల్‌బజార్‌లోని సలూజా నర్సింగ్ హోం ఎదురుగా ఉన్న బస్తీలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ. 20 లక్షల నిధులు మంజూరు అయిన మాట వాస్తవమే. అయితే పలుమార్లు టెండర్లు వేసినప్పటికీ కాంట్రాక్టులు ఎవరూ ముందుకు రావడం లేదు. త్వరలో తిరిగి టెండర్లు వేసి సీసీ రోడ్డు పనులు త్వరగా పూర్తిచేసేలా చూస్తాం.

కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో..

కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న బోర్డు సూపరింటెండెంట్ అక్బర్ అలీ బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా మారేడ్‌పల్లి సుబ్రహ్మణ్య స్వామి ఆలయ పాలక మండలి సభ్యుడు చొల్లేటి రమేశ్ బోర్డు కార్యాలయంలో అక్బర్ అలీని శాలువాతో సన్మానించారు.

- మారేడ్‌పల్లి, జనవరి 31

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

అంబర్‌పేట, జనవరి 31 : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రారంభించారు. శ్రీనివాసనగర్ కాలనీలో రూ. 20 లక్షలు, వినాయకనగర్‌లో రూ. 20 లక్షలతో సీసీ రోడ్లను నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిడీపీరెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, వాటర్ వర్క్స్ మేనేజర్ మాజిద్ పాల్గొన్నారు.

కేంద్రంపై సమరమే..

కాచిగూడ, జనవరి 31: బీసీల ఆకాంక్షలను నెరవేర్చడంలో ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. బుధవారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కులగణనపై బీజేపీ మంత్రులు, ఎంపీలకు ధైర్యం ఉంటే ప్రధానిపై ఒత్తిడి తేవాలని, బీసీల భావితరాల కోసం కులగణన చేపట్టాలన్నారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు దాటినప్పటికీ బీసీలకు ప్రజాస్వామ్యబద్ధంగా విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో న్యాయం జరగడంలేదని ధ్వజమెత్తారు. కేంద్రం బీసీలపై వ్యతిరేక వైఖరి మార్చుకోకపోతే జాతీయ స్థాయిలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

అసమానతలు లేని సమాజానికి గద్దర్ కృషి

ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 31: ప్రజాయుద్ధనౌక గద్దర్ జయంతిని ఉస్మానియా యూనివర్సిటీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన గద్దర్ విగ్రహావిష్కరణకు తరలివెళ్లారు. అంతకుముందు విద్యార్థి నాయకులు నెల్లి సత్య, నామ సైదులు, దివాకర్ మాట్లాడుతూ.. గద్దర్ దోపిడీ, పీడన, అణిచివేతలకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు. అసమానతలు లేని సమ సమాజానికి తన మాట, పాటతో ప్రజలను చైతన్యం చేసి, ప్రజాస్వామిక, సామాజిక తెలంగాణ కోసం జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. ఆయన తెలంగాణ సమాజానికి చేసిన సేవలను గుర్తించి, రాష్ట్ర ప్రభుత్వం ఓయూలో గద్దర్ పేరుతో సాహితీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు శశివర్ధన్, సాగర్, వికాస్, ఉపేందర్, వంశీ, అఖిల, నిహారిక, అశ్విని, శ్రావణి, సరళ, దివ్య, అరుణ్, భీంసాగర్, సంతోష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

- తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కొండ నాగేశ్వరరావు, డాక్టర్ సవిన్ సౌడ, సునీల్ శెట్టి, డాక్టర్ మేడి రమణ, డాక్టర్ అందె కృష్ణ, దర్శనం జాన్, వలిగొండ నరసింహ, రవీందర్‌నాయక్, మోడం రవి, నాగేశ్వరరావు, సుమంత్, ఉదయ్, భీమ్‌రావునాయక్, వేణుగోపాల్, అంబేద్కర్, ఆంజనేయులు ముదిరాజ్, తలారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సన్మానం..

తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో 35 ఏళ్ల పాటు ఉద్యోగం చేసి బుధవారం పదవీ విరమణ చేసిన అటెండర్ శ్రీనివాస్‌ను సంస్థ ఉద్యోగులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ చీఫ్ ఇంజినీర్ బి.రఘు క్రమశిక్షణ గల ఉద్యోగిగా శ్రీనివాస్ అందించిన సేవలను కొనియాడారు.

- అమీర్‌పేట్, జనవరి 31